క్లుప్తంగా

ఆంగ్ల భాషపై అవగాహన



ఇంగ్లిష్ భాషపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు వెంకటఅప్పారావు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం ఆంగ్ల భాషపై ఉపాధ్యాయుడు వెంకటఅప్పారావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆంగ్ల వ్యాకరణంపై తర్ఫీదునిచ్చారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఉపాధి కూలీలకు రసీదులు అందిస్తున్న సర్పంచ్ వాసు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని మల్లవరం, నరేంద్రపురం పరిధిలోని గ్రామీణ ఉపాధి హామీ పనుల్ని సర్పంచ్ పిన్నమరాజు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. రసీదుల్ని అందించారు. చందక శివ, చందక బాబ్జి, వీఆర్పీ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ



స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణలో విద్యార్థులు

నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంగళవారం లైబ్రేరియన్ కె.జనార్దన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంగ్లిష్ పదాలు, వాక్య నిర్మాణం, చిన్న చిన్న పదాలతో మాట్లాడటం నేర్పించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం



ఆంజనేయస్వామి సన్నిధిలో పూజలు

రాంబిల్లి : రాంబిల్లిలో ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నంరాజు వెంకటపతిరాజు(చంటిరాజు), ఆయన కుమారుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్‌ల ఆధ్వర్యంలో తీర్థమహోత్సవం సందర్భంగా స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు, కోలాటాలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిపారు. పలు గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విజ్ఞాన శిబిరాలు జ్ఞాన మందిరాలు



కోటవురట్లలో వేసవి విజ్ఞాన శిబిరం

కోటవురట్ల : స్థానిక శాఖా గ్రంథాలయంలో రెండో రోజు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు గ్రంథాలయాల సందర్శన ఆవశ్యకత, పుస్తక పఠనం ప్రాధాన్యతను వక్తలు వివరించారు. గ్రంథాలయాల ద్వారా సమస్త సమాచారం, విలువైన విషయాలను గ్రహించవచ్చన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ అప్పలనాయుడు, ఉపాధ్యాయుడు షేక్ మస్తాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో శిక్షణ

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్ర లేఖనంపై అవగాహన కల్పించారు. కథలు చెప్పి విద్యార్థులకు వేసవి శిబిరంపై ఆసక్తిని పెంచినట్లు లైబ్రేరియన్ ఎస్.శకుంతల తెలిపారు. ఈ శిబిరానికి 25 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

జోరందుకున్న ధాన్యం కొనుగోళ్లు

- ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం
- అన్నదాతలకు గిట్టుబాటు ధరతో భరోసా



యంత్రాల సాయంతో వరి కోత, నూర్పు పనులు



ఆర్‌బీకేల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్రాక్టర్లో తరలిస్తున్న సిబ్బంది, రైతులు

రాంబిల్లి : ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కేలా జగనన్న ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోంది. ప్రభుత్వమే ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తూ భరోసానిస్తోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వం ఉన్నతాధికారులకు ఇటీవల ఆదేశాలిచ్చింది. ఈ మేరకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జిల్లా ప్రత్యేకాధికారి జె.నివాస్ సోమవారం దిమిలిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలతో దళారులకు చెక్ పడుతుందని అధికారులు, రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రాంబిల్లి మండలంలో సుమారు 1700 ఎకరాల్లో రబీ వరి సాగును చేపట్టారు. ఇప్పటికే కోతలు ముగింపు దశకు చేరాయి. నూర్పులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దిమిలి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు కూడా ప్రారంభమయ్యాయి. ఈ కేంద్రం ద్వారా 500 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. నెల్లూరు సన్నాలు, ఇంద్ర, 1010 తదితర వరి రకాలను రైతులు సాగు చేశారు.

క్వింటాల్ సాధారణ రకం రూ.2,040, ఏ గ్రేడు రకం రూ.2,060గా ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించింది. ప్రైవేట్ వ్యాపారులు ఈ ధర కన్నా రూ.200 వరకు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు రైతులు మక్కువ చూపిస్తున్నారు. అయితే ధాన్యం కొనుగోలు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు ఇబ్బందికరంగా మారాయి. సంబంధిత యాప్‌లు సక్రమంగా పనిచేయక కొనుగోలు ప్రక్రియ మందకొడిగా సాగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రక్రియను సులభతరం చేసేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలతో మేలు



ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రైవేట్ వ్యాపారుల కంటే ప్రభుత్వం గిట్టుబాటు ధరతో ఎక్కువ మొత్తం వస్తుంది. వీలైనంత వేగంగా కొనుగోళ్ల జరపాల్సి ఉంది. యాప్‌ల సమస్యల్ని పరిష్కరించి, రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి.

–దొడ్డ లచ్చమ్మ, రైతు, దిమిలి

పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం



రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తాం. మండలంలో 500 మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యం. రెండు రోజుల్లో 60 టన్నులు సేకరించాం. ధర ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.

– సి.సుమంత, వ్యవసాయాధికారి, రాంబిల్లి

'జగనన్నకు చెబుదాం'తో వేగంగా సమస్యల పరిష్కారం



జగనన్నకు చెబుదాం వీడియోను వీక్షిస్తున్న మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు



జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని తిలకిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు



నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సీఎం సందేశాన్ని వింటున్న మండల అధికారులు



జగనన్నకు చెబుదాం ప్రారంభోత్సవంలో సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న అధికారులు

ఎస్.రాయవరం : జగనన్నకు చెబుదాం కార్యక్రమంతో ప్రజా సమస్యలు మరింత త్వరితగతిన పరిష్కారమవుతాయని ఎంపీడీవో రామచంద్రమూర్తి అన్నారు. రాష్ట్రంలో మంగళవారం సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని వీడియోద్వారా వీక్షించారు. సీఎం ఆదేశాలు మేరకు అధికారులు మరింతగా సమస్యల పరిష్కారానికి చొరవతీసుకుంటారని తెలిపారు. ఫిర్యాదుదారులు ఇకపై తమ సమస్యలను నేరుగా సీఎం కార్యాలయానికి ఫోన్ ద్వారా చెప్పుకోవచ్చన్నారు. ఆ ఫిర్యాదులు సంబంధిత అధికారులకు పంపి, పరిష్కారం, జాప్యంపై నేరుగా సీఎం క్యాంపు కార్యాలయమే పర్యవేక్షిస్తుందన్నారు. ఇంతవరకు ఉన్న స్పందన కార్యక్రమం కన్నా వేగంగా సమస్యలకు పరిష్కారం దొరకనుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షులు కొణతాల శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్యామ్‌కుమార్, ఏపీఎం శివప్రసాద్, గృహనిర్మాణశాఖ ఏఈ ప్రసాద్, ఇరిగేషన్‌శాఖ ఏఈ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ కోరారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమ వీడియో కాన్ఫరెన్స్‌ను ఆర్‌బీకేలో ప్రజా ప్రతినిధులు, అధికారులు తిలకించారు. ఈ సందర్భంగా స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం మరింతగా దోహదపడుతుందన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎవరికైనా అన్యాయం జరిగితే టోల్‌ఫ్రీ నెం.1902ను సంప్రదిస్తే సత్వర న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నక్కపల్లి : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, ఎంపీడీవో సీతారామరాజులు సూచించారు. మంగళవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన కార్యక్రమాన్ని వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి తిలకించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంతో ప్రజలు నేరుగా తమ సమస్యలను జగనన్నకు చెప్పుకోవచ్చన్నారు. 1092 టోల్‌ఫ్రీ నెంబరు ద్వారా ప్రభుత్వం సంక్షేమపథకాల లబ్ధి, సమస్యలపై నేరుగా సీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రతి సమస్యకూ ఒక ఐడీ కేటాయించి, దాని ద్వారా పరిష్కారం ఏ స్థాయిలో ఉందో ట్రాక్ చేయొచ్చన్నారు. కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నీరజ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, వివిధ ప్రభుత్వశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల : జగనన్నకు చెబుదాం కార్యక్రమ ప్రారంభోత్సవాన్ని మండల పరిషత్ సమావేశ మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు వీక్షించారు. ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలు అందకపోవడం, స్థానిక సమస్యలపై నేరుగా 1902కు కాల్ చేసి సీఎంవోకు నివేదించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణరావు, ఈవోపీఆర్డీ ప్రేమ్ సాగర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో ఉత్తమ ఫలితాలు



టెన్త్‌లో మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

మునగపాక : విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలని మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం కాండ్రేగుల వెంకట సూర్యనారాయణ సూచించారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థుల అభినందన కార్యక్రమం మంగళవారం స్థానిక హైస్కూల్లో నిర్వహించారు. పాలిసెట్ మోడల్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రణాళికాపరంగా చదివితే, ఎలాంటి పరీక్షల్లోనైనా రాణించవచ్చన్నారు. చదువులో ఏకాగ్రత తప్పనిసరని పేర్కొన్నారు. అనంతరం ఇటీవల డాక్టరేట్ అందుకున్న మళ్ల జోగారావును సంస్థ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన వీసం



డిప్యూటీ సీఎంను కలిసిన వీసం రామకృష్ణ

నక్కపల్లి : ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, అనకాపల్లి జిల్లా స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబులు మంగళవారం దేవరాపల్లిలో కలిశారు. నక్కపల్లి మండలంలో నెలకొన్న సమస్యలు, ప్రధానంగా సచివాలయాలు, ఆర్‌బీకేల బిల్లుల చెల్లింపులపై మాట్లాడినట్లు వీసం తెలిపారు. స్టూడెంట్ విభాగం తరఫున పటిష్టమైన మండల కమిటీలు ఏర్పాటు చేయడంపై మంత్రితో చర్చించామన్నారు. జల్ జీవన్ మిషన్ పనులు, గ్రామీణ ప్రాంతాల రోడ్ల మరమ్మతులకు నిధుల విడుదలపై నివేదించినట్టు తెలిపారు.

ప్రభుత్వ స్కూళ్లు ముద్దు.. ప్రైవేట్ స్కూళ్లు వద్దు



కొక్కిరాపల్లిలో బడిబాట ర్యాలీలో ఉపాధ్యాయులు

యలమంచిలి : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరికలపై మంగళవారం కొక్కిరాపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొక్కిరాపల్లి గ్రామంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొడ్డేడ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ సర్పంచ్ పాలరౌతు నరసింగరావు ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ బడిలో చేర్పించండి.. పిల్లల జీవితాల్లో వెలుగులు నింపండి అంటూ ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న వసతులు, విద్యా విధానంపై తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలో భాగంగా మూడు జతల యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ఒక జతబూట్లు, రెండు జతల సాక్సులు, బెల్ట్, బ్యాగ్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. విద్యార్థుల కోసం గతంలో ఎన్నడూ లేనంతగా సీఎం జగన్ ప్రభుత్వం నాడు–నేడులో పాఠశాలల్ని కార్పొరేట్ స్థాయికి మించి అభివృద్ధి చేశారని కొనియాడారు. జగనన్న గోరుముద్దతో పోషకాహారం, బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు, డిజిటల్ బోధనతో దేశంలో మిగిలిన రాష్ట్రాలకు మన రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందన్నారు.

తాజా పదోతరగతి ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లలో చదివిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినట్టు తెలిపారు. పాలరౌతు నరసింగరావు మాట్లాడుతూ సీఎం జగన్ చొరవతో ఆంగ్ల మాధ్యమంలో ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్టు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ స్కూళ్లకు, ఇపుడున్న స్కూళ్లకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని వసతుల్ని గుర్తించి తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాల్సిందిగా కోరారు.

మూడు గ్రామాల్లో 'గడప గడపకు' నేడు

మునగపాక : మండలంలోని మూలపేట, మంగళవరపుపేట, గంగాదేవిపేట గ్రామాల్లో బుధవారం ఉదయం 6 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుంటారన్నారు. అనంతరం సచివాలయం వద్ద వలంటీర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

యోగాతో విద్యార్థుల్లో ఏకాగ్రత

పాయకరావుపేట : విద్యార్థులకు యోగాభ్యాసం ఎంతో ముఖ్యమని, ప్రతీ విద్యార్థి యోగా సాధన చేస్తే ఏకాగ్రత పెరుగుతుందని పలువురు విశ్రాంత ఉద్యోగులు సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు యోగా ఉపయోగం, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, చదవడంపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. అనంతరం తెలుగు చదవడం, రాయడంలో మెలకువల్ని వివరించారు. గ్రంథాలయంలోని పుస్తకాల్లో ఉన్న నీతి కథలు, పద్యాలు చదివించారు. ఈ శిబిరానికి 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.లక్ష్మణరావు, సీతారామయ్య, సత్యనారాయణ పలువురు విశ్రాంత ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు ప్రారంభం



వాటర్‌ట్యాంకు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, ప్రహ్లాద్‌రెడ్డి, సుకుమారవర్మ

అచ్యుతాపురం(అనకాపల్లి) : స్థానిక యోకోహోమా టైర్ల కంపెనీ సేవలు అమోఘమని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబురాజు) అన్నారు. మండలంలోని మార్టూరు గ్రామంలో కంపెనీ సహకారంతో నిర్మించిన 10 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకును కంపెనీ అధినేత ప్రహ్లాద్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవినీటి ఎద్దడి లేకుండా గ్రామస్తులకు మంచినీటి ట్యాంకు నిర్మించి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు ప్రహ్లాద్‌రెడ్డి మాట్లాడుతూ వాటర్‌ట్యాంకు సమీపంలో ఉన్న మార్గంతోపాటు పరిసర ప్రాంతాల సుందరీకరణ, పరిశుభ్రత మెరుగుదలకు భారీ మొత్తం వెచ్చించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, కంపెనీ ప్రతినిధి రష్మీత్‌కౌర్, సీఈవో సాహిల్ ఆరోరా, కంపెనీ హెచ్ఆర్ అద్దంకి వేణుగోపాల్, గ్రామ సర్పంచ్ రమేష్‌రాజు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కన్నబాబురాజు



మునగపాకలో ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు(కన్నబాబురాజు) అన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మునగపాకలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని అడిగి, వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. నాలుగేళ్ల కాలంలో కుటుంబాలవారీగా అందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలని అభ్యర్థించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను శతశాతం అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మునగపాక బీసీ కాలనీలో డ్రైన్లు నిర్మిస్తామని, దళితవాడలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలకు తనవంతు సాయం అందజేస్తానని భరోసానిచ్చారు. మునగపాక సంత బయలు నుంచి సంపద తయారీ కేంద్రానికి వెళ్లే మార్గాన్ని ఆనుకుని ఉన్న పూరిపాకలల్ని తొలగించి సంబంధిత వ్యక్తులకు పట్టాలు అందిస్తామన్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ పూరిపాకల్లో ఉండేవారు ఇళ్లు నిర్మించుకుంటే తన వంతుగా రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, పార్టీ నేతలు సూరిశెట్టి రాము, గణేష్, రామ్మోహనరావు, మహేష్, పిల్లి అప్పారావు, సంజీవరావు, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల మహోత్సవం



బంగారమ్మతల్లిని దర్శించుకున్న ఎంపీపీ తదితరులు



వాలీబాల్ విజేతలకు బహుమతి అందిస్తున్న నాయకులు

ఎస్.రాయవరం : రేవుపోలవరం బంగారమ్మతల్లి జాతర మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారి ఆలయానికి చేరుకుని పసుపు కుంకుమలు సమర్పించుకున్నారు. రేవుపోలవరం, కొత్త రేవుపోలవరం గ్రామాలకి చెందిన మత్స్యకారులు అయితే తమ ఆచార సాంప్రదాయాలతో పందిపిల్లల్ని తీసుకొచ్చి అమ్మవారికి మొక్కు చెల్లించుకున్నారు. జాతరను పురస్కరించుకుని ఎంపీపీ కోన లోవలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షులు కొణతాల శ్రీనివాసరావు, గుడివాడ సర్పంచ్ ధూళి శ్రీనుబాబు, ఎస్.రాయవరం ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు చోడిపల్లి అప్పలరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకుని, జాతర భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొందరు భక్తులు అమ్మవారి ఆలయ సన్నిధిలో వంటకాలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు.

కొరుప్రోలులో పైడితల్లి అమ్మవారి ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి చీర సారెలతో, పసుపు కుంకుమలు సమర్పించారు. మధ్యాహ్నం అమ్మవారి ఘటాలను భారీ ఊరేగింపుగా తీసుకువెళ్లారు.

వాలీబాల్ విజేతలకు బహుమతి

రేవుపోలవరం బంగారమ్మతల్లి జాతరను పురస్కరించుకుని నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఇందులో తూర్పుగోదావరి జిల్లా సీతానగరం జట్టు ప్రథమ బహుమతి సాధించగా, ప్రకాశం జిల్లా వాడరేవు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ మేరకు ఉత్సవ కమిటీ సభ్యులు విజేతలకు బహుమతులు అందించారు.

గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న సర్పంచ్‌లు

పాయకరావుపేట : మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరారు. మండల పరిషత్ ఆవరణలోని స్త్రీ శక్తి భవన్‌లో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. మండల పరిషత్ అధ్యక్షురాలు ఇసరపు పార్వతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. తాగునీరు, ప్రారంభానికి నోచుకుని అభివృద్ధి పథకాలపై ప్రశ్నించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్ కల్యాణ్ వారికి సమాధానమిస్తూ గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పనులు చురుగ్గా సాగుతున్నాయని, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటైతే తాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. పాల్మన్‌పేటలో హౌసింగ్ రుణాలతో ఇళ్లు నిర్మించుకుని, ఓటీఎస్ ద్వారా రుణం చెల్లించినా, పట్టాలు ఇవ్వలేదని సర్పంచ్ కోటేశ్వరరావు ఆరోపించారు. తహసీల్దార్ కె.జయప్రకాష్ స్పందిస్తూ హౌసింగ్ అధికారులు పరిశీలించి, పట్టాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ముఠా కాలువ పూడికతీత పనులు, పీఎల్ పురంలో ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చి, స్థలాలు కేటాయించకపోవడంపై ఆయన స్పందించారు. గ్రామాల్లో చేపడుతున్న నాడు–నేడు పనులను సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు పాఠశాల కమిటీ తెలియపరచట్లేదన్న ఫిర్యాదుపై ఎంపీడీవో స్పందించి, తక్షణ ఆదేశాలు జారీ చేస్తానన్నారు. జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ మాట్లాడుతూ గ్రామాల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు ధనిశెట్టి మాధవి, పల్లేల మణికంఠస్వామి, పీఆర్ డీఈ వై.హరి, హౌసింగ్ డీఈ విజేయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



యలమంచిలి గ్రంథాలయంలో బుక్ రీడింగ్‌పై విద్యార్థులకు వివరిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు

యలమంచిలి : గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని యలమంచిలి గ్రంథాలయాధికారి వి.ఆనంద్ అన్నారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయులు, మండల రిసోర్స్ పర్సన్ వై.అప్పారావుతో కలిసి బుక్ రీడింగ్‌పై విద్యార్థులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ వేసవిలో విద్యార్థుల మేధో సంపత్తిని, వారిలో పోటీతత్వం అలవడేలా కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు.

రైతులకు పట్టాదారు పుస్తకాల పంపిణీ



రైతులకు పట్టాదారు పుస్తకాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి జానకీరామ్

మునగపాక : రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి ద్వారం జానకీరామ్ అన్నారు. మండలంలోని ఒంపోలు సచివాలయంలో మంగళవారం శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా రైతులకు పట్టాదారు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పట్టాదారు పుస్తకం కోసం రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే వారన్నారు. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనా వికేంద్రీకరణతో రైతుల వద్దకే పుస్తకాలు అందుతున్నాయన్నారు. ఈ పథకం ద్వారా రైతుల భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం దొరికిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి, సర్పంచ్ గండ్రెడ్డి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నేత బొద్దపు శ్రీరామమూర్తి, వీఆర్వో జోగినాయుడు పాల్గొన్నారు.